క్లుప్తంగా

7ఎల్ఈపీలో 21వ సంస్మరణ సభ



నివాళి అర్పిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికులు, వివిధ యూనియన్ నాయకులు 21వ సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ఆర్జీ–2ఏరియా 7ఎల్ఈపీ గనిలో 2003 జూన్ 16న జరిగిన ప్రమాదంలో 17 మంది కార్మికులు మృతి చెందారు. వారిని స్మరించుకుంటూ గని ఆవరణలో ఏర్పాటు చేసిన స్తూపం వద్ద కార్మికులు, వివిధ యూనియన్ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు జరగకుండా సింగరేణి యజమాన్యం రక్షణ చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, బీఎంఎస్, హెచ్ఎంఎస్, సీఐటీయూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ కార్యాలయంలో ప్రజావాణి

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు మండల ఏఈ ఆశ శంకర్ తెలిపారు. ప్రజావాణిలో విద్యుత్ సమస్యలకు సంబంధించి మాత్రమే నివేదించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క విద్యుత్ వినియోగదారుడు వినియోగించుకుని మెరుగైన విద్యుత్ సేవలు పొందాలని సూచించారు.

పోచమ్మ బోనాలు

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో ఆదివారం పోచమ్మ బోనాలు, పట్నాలు ఘనంగా నిర్వహించారు. పంబాల పూజారులు గ్రామంలోని చావడి వద్ద పట్నాలు వేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఎంపీటీసీ దండె వెంకటేశం, మాజీ సర్పంచ్ ఈర్ల మల్లేశం, బొడిగె లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల రాజీవ్ రహదారిపై కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి రామగుండంకు చెందిన వేముల శ్రీనివాస్ బైక్‌పై గోదావరిఖని నుంచి రామగుండం వెళ్తుండగా అదేమార్గంలో వచ్చిన కారు ఢీకొన్నది. గాయాలైన శ్రీనివాస్‌ను ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్, బ్లూకోల్ట్స్ సిబ్బంది అంజన్న, పురుషోత్తం, శ్రీనివాస్ చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

నేడు విద్యుత్ ప్రజావాణి

జ్యోతినగర్: రామగుండం నియోజకవర్గం మేడిపల్లి సెక్షన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి న్యూపీకే రామయ్యకాలనీ సబ్‌స్టేషన్ మేడిపల్లి సెక్షన్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఎన్పీడీసీఎల్ సంస్థ ఏర్పాటు చేసిందని అసిస్టెంట్ ఇంజనీర్ ఆరెపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వినియోగదారులు విద్యుత్‌కు సంబంధించిన ఎటువంటి సమస్య ఉన్నా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న మిత్రులు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రానికి చెందిన పెండెం నగేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నగేశ్ కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు అతడి కుటుంబానికి ఆదివారం రూ.25వేలు అందజేశారు. మిత్రులు అల్లం సతీశ్, ఇరుకుల్ల వీరేశం, క్యాతం సంతోష్, సతీశ్, నగేశ్ ఉన్నారు.

గెస్ట్ టీచర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ధర్మారం: నందిమేడారం తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయంలో గెస్ట్ టీచర్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాధవీలత శనివారం తెలిపారు. సంస్కృతం, పీజీటీ(మాథ్స్), పీజీటీ(ఫిజిక్స్), పీజీటీ(ఇంగ్లిష్) సబ్జెక్టుల్లో బోధించేందుకు ఆసక్తి, అర్హత గలవారు దరఖాస్తు చేయాలన్నారు. ఈనెల 18న ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్లతో డెమోకు హాజరుకావాలని కోరారు. మరింత సమాచారం కోసం 77021 00881 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు వేశారు.. బ్రిడ్జి మరిచారు

- ఐదేళ్లుగా మంజూరు కాని నిధులు
- ప్రమాదాలకు నిలయంగా మారిన మూలమలుపు
- భయాందోళనలో వాహనదారులు



హరిపురంలో బ్రిడ్జి నిర్మించే ప్రదేశం

ఓదెల: మండలంలోని హరిపురం–కొలనూర్ గ్రామాల మధ్యలో తారురోడ్డు వేశారు. కానీ బ్రిడ్జి నిర్మించడం మరిచిపోయారు. దీంతో ప్రయాణికులు భయాందోళనలో ఉన్నారు. రోడ్డు వేసి ఐదేళ్లవుతున్నా బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. ఈ ఐదేళ్లలో మూలమలుపు వద్ద 20 ప్రమాదాలు జరిగాయని వాహనదారులు పేర్కొంటున్నారు.

మలుపుతో ప్రమాదం..

హరిపురం మీదుగా మండల కేంద్రం ఓదెలతోపాటు జమ్మికుంట, వావిలాల, వీణవంకకు వెళ్తుంటారు. సుల్తానాబాద్, ఉప్పరపల్లె, గోపరపల్లె, కొలనూర్ గ్రామాలకు చెందిన ప్రయాణికులు, గ్రామస్తులు హరిపురం రోడ్డు మీదుగా ప్రయాణిస్తారు. అయితే ఇరుకుగా ఉన్న మూలమలుపు ప్రమాదకరంగా మారింది. హరిపురం నుంచి కొలనూర్ వరకు తారురోడ్డు వేశారు. కానీ బ్రిడ్జి నిర్మించలేదు. రాత్రిపూట ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. వెంటనే బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మించాలి



హరిపురం–కొలనూర్ గ్రామాల మధ్యలో మూలమలుపు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. ప్రస్తుతం ఎలాంటి బ్రిడ్జి లేనందున వాహనాలు పల్టీ కొడుతున్నాయి. చాలా ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు.

– పోలపల్లి రాంరెడ్డి, గోపరపల్లె

ఐదేళ్లలో అనేక ప్రమాదాలు



హరిపురం గ్రామశివారులో బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలి. ఐదేళ్లలో చాలా సార్లు ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలతో బయటపడ్డారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే బ్రిడ్జిని వెడల్పుగా నిర్మించాలి.

– ముప్పు రాకేశ్, హరిపురం

రోడ్డు వెడల్పు చేయాలి



కొలనూర్–హరిపురం గ్రామాల మధ్యలో బ్రిడ్జి లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్లు, బైక్‌లు ఎగిరిపడడంతో ప్రాణాలతో బయటపడ్డారు. అయినా ప్రభుత్వం బ్రిడ్జి కట్టలేదు. వెంటనే మూలమలుపు వద్ద రోడ్డు వెడల్పు చేసి బ్రిడ్జిని నిర్మించాలి.

– లింగయ్య, గోపరపల్లె

కొనసాగుతున్న భగీరథ ఇంటింటి సర్వే

- ప్రత్యేక యాప్ ద్వారా వివరాల నమోదు
- మండల పరిధిలో 50 మంది ఎన్యుమరేటర్లు



ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్న ఎన్యుమరేటర్

రామగుండం: ఇంటింటికీ శుద్ధిజలాలు అందించేందుకు కోట్లాది నిధులు వెచ్చించి గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ పథకం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కానీ క్షేత్రస్థాయిలో తరచూ అధికారులకు భగీరథ నీటి సరఫరాపై అత్యధిక ఫిర్యాదులు రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే తొలుత ఇంటింటా భగీరథ సర్వే చేయించేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించి ఇంటి వివరాలతో పాటు సమస్యలను అందులో నమోదు చేయించే కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. సదరు ఫిర్యాదుల స్వీకరణకు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను ఎన్యుమరేటర్లుగా నియమించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, అదనపు కలెక్టర్ సమక్షంలో డీఆర్డీవో, డీపీవో, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈలు తదితర అధికారుల పర్యవేక్షణలో సర్వే కొనసాగుతుంది. ఇందులో భాగంగానే అంతర్గాం మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీల్లో 50 మంది ఎన్యుమరేటర్లను నియమించి ప్రతి ఎన్యుమరేటర్ ఒక రోజులో కనీసం 25 గృహాలలో వివరాలు సేకరించి ప్రత్యేకంగా రూపొందించిన ఆన్‌లైన్ యాప్‌లో ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను పది రోజుల్లో పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ సాంకేతికపరమైన నెట్‌వర్క్ అంతరాయంతో కొంత జాప్యం జరిగే అవకాశం ఉంటుందని పలువురు అధికారులు పేర్కొంటున్నారు.

నమోదులో సేకరించాల్సిన అంశాలు..

ప్రత్యేకంగా రూపొందించిన భగీరథ యాప్‌ను ఎంట్రీ చేయగానే ఇంటి యజమాని పేరు, ఆధార్, పురుషుడు, స్త్రీ, కులం, సెల్ నెంబర్, ఇంటి చిరునామా, కుటుంబసభ్యుల వివరాలు, మిషన్ భగీరథ కనెక్షన్ ఉందా.. ఇంకేదైనా తాగునీటి కుళాయి కనెక్షన్ ఉందా.. భగీరథ నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలను యాప్‌లో ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత యజమాని మొబైల్ నంబర్‌కు ఓటీపీ (వన్‌టైం పాస్‌వర్డ్) రావడంతో సదరు నెంబర్‌ను యాప్‌లో ఎంట్రీ చేయగానే సమస్య అధికారులకు ఆన్‌లైన్‌లో కనిపిస్తుంది.

పరిశీలిస్తున్నాం



మిషన్ భగీరథ సమస్యలపై గ్రామాల్లో కొనసాగుతున్న ఇంటింటా సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్ల పని విధానాన్ని ఆకస్మికంగా పరిశీలిస్తున్నాం. సాంకేతిక సమస్యలతోనే కాస్త జాప్యం జరుగుతున్నప్పటికీ సర్వే పనులు కొనసాగుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో మండల పరిధిలో సర్వే ప్రక్రియ పూర్తవుతుందని ఆశిస్తున్నా.

– ఎం.ఏ.అలీం, ఎంపీడీవో, అంతర్గాం

చిన్నారికి కొవ్వొత్తుల నివాళి



పెద్దపల్లి మండలం సబ్బితంలో..



ముత్తారం: హరిపురంలో నివాళి

పెద్దపల్లిరూరల్: ఆరేళ్ల చిన్నారిని పాశవికంగా అత్యాచారం చేసి హతమార్చిన నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి మాజీ సర్పంచ్ చుంచు సదయ్య, సతీశ్ తదితరులతో పాటు పలువురు గ్రామస్తులు సహస్రకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు.

రామగుండం: పెద్దపల్లి జిల్లా కాట్నపల్లిలో చిన్నారిపై జరిగిన ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని, నిందితుడిని ఉరి తీయాలని కొండల రాజేందర్‌కుమార్ కోరారు. ఆదివారం అక్బర్‌నగర్ ఇంటెలిజెన్స్ కమిటీ ఆధ్వర్యంలో నిందితుడి దిష్టిబొమ్మను దహనం చేశారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు, గంజాయి, మాదక ద్రవ్యాల లభ్యతతో విచక్షణ కోల్పోయి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. లియాకల్ అలీ, చాంద్‌పాషా, చంద్రయ్య, సలీం, ఖలీల్, అజీమ్, కిరణ్, ఇమ్రాన్, రవి, షఫీ, బాబా రాజశేఖర్ పాల్గొన్నారు. లింగాపూర్ గ్రామంలో మహిళలు కొవ్వొతులతో నివాళి అర్పించారు. నిమ్మరాజుల మాధవి, పద్మ, కవిత, పవిత్ర, దీప, సాహితీ, స్వప్న, మౌనిక, రమాదేవి, సరిత, పద్మరాజు, అనురాధ, శిల్పాని శివాని ఉన్నారు.

ముత్తారం: మండలంలోని హరిపురంలో ఆదివారం రాత్రి సుల్తానాబాద్‌లో కామాంధుడి చేతిలో అసువులు బాసిన చిన్నారి సహస్రకు స్థానికులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. మాజీ సర్పంచ్ సంపత్‌రావు, శ్రీనివాస్, మౌనిక, సతీశ్ పాల్గొన్నారు.

జ్యోతినగర్: చిన్నారిపై అఘాయిత్యం, హత్య అమానవీయ సంఘటన అని మల్టిపుల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఐఎన్టీయూసీ కార్యదర్శి పుసాల తిరుపతి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడారు. చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడి, హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

యైటింక్లయిన్‌కాలనీ: జిల్లాలోని సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలోని ఓ రైస్‌మిల్లులో చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడి హత్యచేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు బుచ్చమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం కాలనీ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌తో పాటు నాయకులతో కలిసి నిరసన తెలిపారు. నాయకులు శారద, రాజేశ్వరి, మధునమ్మ, పద్మ, మధునమ్మ, నిర్మల పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై సమరం



మాట్లాడుతున్న కృష్ణ

గోదావరిఖని: కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గాంధీనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నరేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ కార్మికవర్గానికి అనేక హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలోని 3లక్షల మందికిపైగా కాంట్రాక్టు కార్మికులు ఉన్నారని, వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించేలా జీవోలను గెజిట్ నోటిఫికేషన్ చేసి అమలు చేయాలని కోరారు. కార్మికుల సమస్యలపై 20 నుంచి 25 వరకు కలెక్టరేట్ల వద్ద ధర్నా చేస్తామని, పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట 24న ధర్నా చేస్తామని ఆయన తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు వెంకన్న, అశోక్, చిలుక శంకర్, తిప్పని రామ్‌కి, దుర్గయ్య, బుచ్చయ్య, బుచ్చమ్మ, లింగమూర్తి, శ్రావణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పద్మశాలీలు సమాజ హితానికి పాటుపడాలి



లింగాపూర్ నూతన కార్యవర్గం

రామగుండం: పద్మశాలి కులస్తులు సమాజ హితానికి పాటుపడాలని, కులవృత్తులను గౌరవించాలని అంతర్గాం మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఎనగందుల శ్రీకాంత్ అన్నారు. అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామ నూతన కమిటీని ఆదివారం ప్రకటించారు. ఇందులో అధ్యక్షుడు జోగు శంకరయ్య, ప్రధాన కార్యదర్శి అడిచెర్ల చంద్రమౌళి, ఉపాధ్యక్షులు ఎనగందుల సంతోష్, మాటేటి లక్ష్మణ్, కొక్కుల వెంకటేశం, ఆలపాటి భోజేకుమార్ ఉన్నారు.

వరుణుడి కరుణ కోసం కప్పతల్లి ఆట



కప్పతల్లి ఆడుతున్న పిల్లలు

కాల్వశ్రీరాంపూర్: వర్షాలు కురవాలని గ్రామాల్లో రైతులు ఆదివారం కప్పతల్లి ఆడారు. మండలంలోని మొట్లపల్లి గ్రామంలో వర్షాలు కురవాలని రోకలి బండకు కప్పతల్లిని కట్టి పసుపు కుంకుమలు చల్లి కొబ్బరి కాయలు కొట్టారు. వరుణుడి కురిణించాలని ప్రార్థిస్తూ వీధుల్లో తిరిగారు. మహిళలు కప్పతల్లిపై నీళ్లు పోసి వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు పండాలని చేతులు జోడించి మొక్కారు. అనంతరం చక్కెర పాలు బియ్యంతో పాయసం వండి వానదేవుడికి వరదపాశం నైవేద్యంగా సమర్పించారు.

పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలి



ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ముత్తారం: మండలంలోని పారుపల్లి పంచాయతీ శాలగుండ్లపల్లిలో ఆదివారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని కళాజాత ప్రదర్శన చేశారు. ప్రయివేట్ విద్య కన్నా ప్రభుత్వ విద్య మేలు అని తమ ఆటపాటలతో స్థానికులకు అవగాహన కల్పించారు. సర్కారు బడులో ఇంగ్లీషు మీడియంతో పాటు అన్ని సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో కళాకారులు కొండ్ర వెంకన్నగౌడ్, ఇల్లందుల మల్లేశ్, జనగామ రాజనర్సు, బుర్ర శంకర్ గౌడ్, పద్మ, సలేంద్ర రాజన్న, దీకొండ శ్రావణ్, కట్కూరి శ్రీవల్లి ఉన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వాకర్స్ ఔదార్యం



నగదు అందజేస్తున్న వాకర్స్

కోల్‌సిటీ: గోదావరిఖని స్టేడియంలో వాకింగ్ చేసే వాకర్స్ స్టేడియం బాయ్‌గా 35ఏళ్ల నుంచి పనిచేస్తున్న ఇంతియాజ్ కుమార్తె వివాహానికి అండగా నిలిచారు. పెళ్లికి వారంరోజుల ముందుగానే వాకర్స్ ఆధ్వర్యంలో రూ.లక్ష నగదుతో పాటు 75 కేజీల బియ్యాన్ని ఇంతియాజ్ భార్య, కూతురికి అందించారు. ఇంతియాజ్ కుమార్తె వివాహానికి రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఆర్మీ మిత్రులు, పోలీస్ సిబ్బంది, వ్యాపారస్తులు, రిటైర్డ్ సింగరేణి కార్మికులు, 150 మంది వాకర్స్ మిత్రులు సహాయం చేశారు. ఇంతియాజ్ కుటుంబ సభ్యులు వాకర్స్‌కు ధన్యవాదాలు తెలిపారు.

జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలి



సన్మానిస్తున్న కందుల సంధ్యారాణి

గోదావరిఖనిటౌన్/రామగుండం: మహిళలు గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు క్రీడల్లో రాణించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. ఆదివారం మార్కండేయకాలనీలోని స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌లో క్రీడాకారిణి సిగిరి శ్రావ్యాంజలికి జరిగిన సన్మాన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఇటీవల కర్ణాటకలో జరిగిన సౌత్ జోన్ ఖేలో ఇండియా ఉమెన్స్ ఉషా లీగ్ పోటీల్లో గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన సిగిరి శ్రావ్యాంజలి సాండా ఫైటింగ్(ఫుల్ కాంటాక్ట్) జూనియర్ 60కేజీల విభాగంలో రాష్ట్రం తరపున బంగారు పతకం సాధించింది. బంగారు పతకం సాధించిన సిగిరి శ్రావ్యాంజలిని, కోచ్ కుమార్‌ను సన్మానించారు. ఉషు అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ కె.కుమార్, తల్లిదండ్రులు సిగిరి నరేశ్, లావణ్య, బీజేపీ నాయకులు రమేశ్, పైతరి రాజు, కందుల పోషం, బాలు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన కాంగ్రెస్ నాయకులు



పాలకుర్తి: మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న రమేశ్

పాలకుర్తి: మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబును ఆదివారం బసంతనగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం పర్మినెంట్ కార్మిక సంఘం నాయకులు కలిశారు. కార్మిక సంఘం అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మంత్రిని శాలువాతో సత్కరించారు. 18న కేశోరాం సిమెంట్ కర్మాగారంలో జరగనున్న కాంట్రాక్టు కార్మిక సంఘం ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు మనోహర్‌రెడ్డి మంత్రితో పాటు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌కు విన్నవించారు.

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు విదేశీ పర్యటన ముగించుకొని స్వదేశానికి వచ్చిన సందర్భంగా పెద్దపల్లి జిల్లా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ఆదివారం కాలనీ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, జక్కుల దామోదర్ రావు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

పాలకుర్తి: మంత్రి శ్రీధర్‌బాబును కన్నాల గ్రామ కాంగ్రెస్ నాయకులు ఆదివారం కలిశారు. విదేశీ పర్యటన ముగించుకుని పెద్దపల్లి జిల్లా కేంద్రానికి వచ్చిన మంత్రిని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు భూతగడ్డల రమేశ్, సట్ల అశోక్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శివకృష్ణ

ధర్మారం: ధర్మారం మండలంకేంద్రంలోని ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా గుమ్మడి శివకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం అతిథి గృహంలో యూత్‌క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై చర్చించిన తర్వాత నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుమ్మడి శివకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సోగాల తిరుపతి, ఉపాధ్యక్షులుగా దేవి అఖిల, మహంకాళి ప్రతాప్, కోశాధికారిగా ఓరెం చిరంజీవి, సంయుక్త కార్యదర్శులుగా దేవి విజయ్, గాజుల రాజేశ్, ప్రచార కార్యదర్శులుగా సోగాల వంశీకృష్ణ, బొల్లి వంశీకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా ఎండీ సలీం, ఎర్రంరాజు పూర్ణచందర్‌రాజు, దేవి కిషోర్, కారంగుల కృష్ణమోహన్, దాయ ఉదయ్, గందం అనిల్, ప్రభాకర్, బొల్లి నాగరాజు, గందం భానేష్, గౌరి అనిత్, మణిశర్మ, వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు దేవి రాజమల్లయ్య, ముజాహిద్, తలమక్కి రవీందర్‌శెట్టి, చిరంజీవి, దేవి రజనీకాంత్, నళినికాంత్, ఎల్లయ్య, దేవి కిరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఆసక్తి, అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నర్మద కోరారు. కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఎదురుగా (మల్కాపూర్‌రోడ్) గల ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో 1వతరగతి నుంచి 7వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం, 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో విద్యాబోధన ఉంటుందని వివరించారు. 6 నుంచి 14ఏళ్ల లోపు వయసు కలిగి ఉండి జిల్లా మెడికల్ బోర్డు జారీ చేసిన సదరం సర్టిఫికెట్ 40 నుంచి 100శాతం అంధత్వం కలిగిన బాల, బాలికలు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 94943 17315, 73962 06959, 94403 38424, 97011 90124 నంబర్లను సంప్రదించాలన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించాలి



మాట్లాడుతున్న దశరథం

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్‌ను వెంటనే నియమించాలని మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరె దశరథం కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద మున్నూరుకాపుల అభివృద్ధి, సంక్షేమం కోసం కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించి రూ.1000 కోట్ల బడ్జెట్, కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మున్నూరుకాపు యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగిల్ నిఖిల్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దాది అభిషేక్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు అశోక్, జంగిట్ నిఖిల్ రాజకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేశ్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా :
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాజేశ్ - 9676603963
రామగుండం : సర్వర్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899